# వలయంలో వనిత

గలగలా నవ్వుతూ, ఉత్సాహంగా మాట్లాడుతున్న 'ప్రతిభ' తల్లిపాదాల చప్పుడు వినగానే గబుక్కున ఫోన్ పెట్టేసింది. తనలోని అలజడిని దాచుకోవడానికి ప్రయత్నిస్తూ తల్లికి ఎదురు వచ్చింది.

"ఫంక్షన్ బాగా జరిగిందా మమ్మీ!" అసహజంగా వున్న ప్రతిభ స్వరం వినగానే ప్రతిభలోని మార్పును గుర్తించింది మైథిలి. విషయమేమిటని ప్రతిభను నిలదీసి అడగడంవల్ల ఆ అమ్మాయి అభిమానం

దెబ్బతింటుందని ఆ విషయం గుర్తించనట్టే కూతుర్ని చేత్తో దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది.

"బాగా జరిగింది నాన్నా! నువ్వు బోటనీ చదవడం పూర్తి చేసేస్తా నన్నావు. పూర్తి చేసేశావా?" మృదువుగా అడిగింది మైథిలి. తల్లి ప్రశ్న విని ఆత్మన్యూనతతో తల వంచుకుంది ప్రతిభ.

"లేదు మమ్మీ! ఈ నైట్‌కి పూర్తిచేసి పడుకుంటాను." నెమ్మదిగా జవాబిచ్చింది ప్రతిభ.

మైథిలి డ్రెస్ మార్చుకుందుకు లోపలికి వెళ్ళిపోయింది. తల్లి కను మరుగవగానే ప్రతిభని ఆలోచనలు చుట్టుముట్టాయి. ఆలోచించినకొద్దీ వెచ్చటి ఆవిర్లు వస్తున్నాయి బుగ్గల్లోకి. ఛ! ఛ! ఎంత దొంగ బ్రతుకు బ్రతకాల్సొచ్చింది! తన కిష్టమయిన వాళ్ళకి ఫోన్ చేసి మాట్లాడే స్వతంత్రం కూడా లేదు తనకీ యింట్లో. కన్నతల్లికి భయపడి "ఫోన్ పెట్టేస్తు న్నాను" అని చెప్పే కనీస సభ్యతకూడా లేకుండా ఫోన్ పెట్టేసింది. తననుగురించి తన ఫ్రెండ్‌కి ఎంత చులకన భావంవస్తుంది! తన ఫ్రెండ్స్ అంతా తన అదృష్టాన్ని చూసి జెలసీతో చచ్చిపోతారు. తన తల్లీ,తండ్రీ రెండు చేతులా ఆర్జిస్తున్నారని. వారికి ఏకైక పుత్రికయిన తననెంతో అపురూపంగా చూచుకుంటారని. తన హృదయంలో పుట్టిన ప్రతి కోరిక మరు నిమిషంలో తీరిపోతుందని. ముఖ్యంగా ఫ్రెండ్స్ విషయంలో బయటి ప్రపంచంలో మసలడం విషయంలో తనకు సంపూర్ణస్వేచ్ఛ వుందని తన ఫ్రెండ్స్ అంతా అనుకుంటారు.

'స్వేచ్ఛ ననుభవించడంలో ఆడ, మగ తేడా ఎందుకుండాలి? మగ పిల్లలకు లేని ఆంక్షలు,ఆటంకాలు ఆడపిల్లలకు మాత్రం ఎందుకుండాలి?'

అని మాటల్లో చెప్పడమే కాక ఆచరించి చూపుతున్న మమ్మీ యీ మధ్య యెందుకనో మారిపోతూంది. తనకి వచ్చే ఫోన్ కాల్స్‌ని సెన్సార్ చేసి, తను చదువుకుంటూందని, డిస్టర్బ్ చెయ్యొద్దని అవతలి వాళ్ళకు ఆదేశిస్తూంటే తన శరీరం కోపంతో దహించుకుపోతూంది. తన కొలీగ్స్‌తో, డాడీ కొలీగ్స్‌తో స్నేహంగా మాటాడడంలో, ఆత్మీయంగా వుండడంలో ఆడ మగ వివక్షతని చూపించని మమ్మీ తన మగ ఫ్రెండ్స్‌ని కొంచెం దూరంగా వుంచాలని ఎందుకు ప్రయత్నిస్తుందో, తిట్టి, కోప్పడి తనని బాధించక పోయినా, చూపులతోనే తన నెందుకు శాసిస్తూందో అర్థం కావడం లేదు. మమ్మీలో వస్తున్న ఈ మార్పుని తన ఫ్రెండ్స్ గుర్తుపట్టేస్తున్నారు. రేపటి నుంచి తన పిరికితనాన్ని చూసి అంతా ఎగతాళి చేస్తారు. తనని ఆరాధించడం మాటటుంచి ఎవరూ గౌరవించనుకూడా గౌరవించరు. తన ప్రిస్టేజ్ అంతా తన కళ్ళ ముందే తగలడిపోయాక యింక తను బ్రతికెందుకు?!....కోపం, బాధ, అవమానం కలగా పులగంగా అయి ప్రతిభ అస్థిరంగా చలించిపోతూంది. అవి యెలాగోలా బయటపడితేకాని టెన్షన్ తగ్గేలా లేదు. గబగబ కాగితం కలం చేతిలోకి తీసుకుంది ప్రతిభ.

తన భావాలన్నీ మమ్మీకి చెప్పేయాలి. తన స్వేచ్ఛకి ఎలాంటి ప్రతిబంధకాన్నీ తను సహించలేదని తెగేసి చెప్పేయాలి. తనేం చిన్న పిల్లకాదు. ఆవిడ గీసిన సరిహద్దు గీతల లోపల మాత్రమే తిరగడానికి. ఆవిడ గీతలు గీచిన కొద్దీ వాటిని దాటాలనే బలమైన కోరిక పుడుతూంది. అయినా తనేం కాని పనిచేస్తూందని మమ్మీ అలా ప్రవర్తిస్తూంది...." అబ్బాయిల్తో మాట్లాడితేనే తన పవిత్రత తగ్గిపోతుందా? వాళ్ళతో కాసేపు హాయిగా కబుర్లు చెప్పుకుంటేనే ఏదో ప్రపంచం తల్లక్రిందు

లయినట్టు చూస్తుందేమిటి అంత చదువుకున్న మమ్మీ కూడా! అసలు వాళ్ళిలా కాపలా కాసి, ఆంక్షలు పెట్టి, భయపెట్టి తమలో అసలేకోశానా లేని భావాల్ని కొత్తగా రేకెత్తిస్తున్నారనే గుర్తింపు యెప్పుడు వస్తుందీ పెద్ద వాళ్ళకి!....అయినా. ఒక వయసు వచ్చిన ఆడపిల్లలు మగపిల్లలు ఆపోజిట్ సెక్స్‌తో మాట్లాడాలని, స్నేహంగా వుండాలని ఆరాటపడడం సహజమనే విషయం మమ్మీకి తెలియదా? తన కాలంలో తనకా భావాలు కలిగి వుండవా?....

అంతెందుకు? యిప్పుడు మాత్రం ఏ విధమైన సంకోచం లేకుండా ఆడ, మగ తేడా లేకుండా మాట్లాడదా తను!....తన భావాలన్నిటినీ ప్రతి బింబింపజేస్తూ ఆవేశంగా, గబగబ తల్లికి లెటరు వ్రాసింది ప్రతిభ. తల్లి వంక చూసే ధైర్యం లేక తల వంచుకునే లెటర్ని తల్లి చేతుల్లో పెట్టి గబగబ యివతలికి వచ్చింది ప్రతిభ.

కూతురి వాలకం చూసి ఆశ్చర్యపోతూ లెటరు చదవడం మొదలు పెట్టిన మైథిలి లెటర్ని పూర్తిచేసి శక్తిలేనట్టుగానే కూర్చుండి పోయింది.

అంతలో ఫోను మ్రోగింది. ప్రతిభ పరుగెత్తి ఫోను తియ్యడం తెలుస్తూనేవుంది. ప్రతిభ గాబరాగా మాట్లాడడం. ఫోను పెట్టేసి తన దగ్గరకు పరిగెత్తుకు రావడం చూచాయగా గుర్తిస్తూనే వుంది.

"మమ్మీ: నా ఫ్రెండ్ ఉజ్వలకి సీరియస్‌గా వుంది. ఇంకొంచెం సేపుంటే చచ్చిపోతుంది. మమ్మీ! కైండ్లీ సేవ్‌హర్. ప్లీజ్ సేవ్ హర్ మమ్మీ!" తనని కౌగిలించుకుని హిస్టీరికల్‌గా ఏడుస్తున్న కూతుర్ని ఓదార్చి అసలు విషయం కనుక్కుంది మైథిలి.

ఉజ్వల ప్రతిభ క్లాస్‌మేట్. ప్రతిభలాగే ఉత్సాహం చురుకుదనం, అందం, ఆకర్షణ, చొరవ వున్న పిల్ల. కాని అంత తెలివిగల అమ్మాయయంత ఫూలిష్‌గా ఎలా ప్రవర్తించింది! గర్భాన్ని తెచ్చుకుని తీసేయించుకునేంత తెగింపెలా వచ్చిందంత చిన్న పిల్లలో! ఇలాంటి విషయాలెంత సర్వసామాన్యంగా అయిపోతున్నాయి రోజురోజుకి! యింతింత చిన్న పిల్లలు కూడా ఎంత తేలిగ్గా తీసుకుంటున్నారీ విషయాల్ని! ఆలోచిస్తూ గేరేజి నుంచి కారు తీసింది మైథిలి. ఒక్క పరుగున వచ్చి మైథిలి ప్రక్కన కూర్చుంది ప్రతిభ. ఒక్క క్షణం ఆలస్యమైతే ఉజ్వల మరి దక్కదేమోనని భీతి చెందుతూ, గుండెల్లో ఆరాటం పైకి రాకుండా నిగ్రహించుకోడానికి ప్రయత్నిస్తోంది ప్రతిభ.

ఉజ్వల ఫ్రెండ్ శిరీష తన ఫ్రెండ్‌కి సాయంగా డాక్టరుదగ్గరకు వెళ్ళింది. తమ ఊరికి వెళ్ళడానికని వార్డెన్ పర్మిషన్ తీసుకుని డాక్టరు దగ్గరకు వెళ్ళింది ఉజ్వల. డాక్టరు చెయ్యాల్సింది చేశాక ఉజ్వలని తమ యింటికి తీసుకు వెళ్ళింది శిరీష. తన ఫ్రెండ్‌కి జ్వరమొచ్చి నీరసించిపోయిందని, తమ యింట్లో రెండురోజులు వుండి వెళ్తుందని యింట్లో వాళ్ళతో చెప్పింది శిరీష. ఏ కారణం చేతో ఒక గంట సేపట్నుంచి విపరీతంగా ఉజ్వలకి బ్లీడింగ్ అయిపోతుంటే, యింట్లో వాళ్ళకు-అసలు విషయం తెలిస్తే జరిగేది తలుచుకుని గుండె ఆగిపోయినంత పనయి కరచరణాలాడక ప్రతిభకు ఫోన్ చేసింది శిరీష.

కారు డ్రైవ్ చేస్తూ, కూతురికి ధైర్యం చెప్తూ ఆలోచిస్తోంది మైథిలి. నిండా పధ్నాలుగేళ్ళు లేని ప్రతిభ కాలేజీలో అడుగు పెట్టిన దగ్గర్నుంచి మారిపోతూంది. ఆకాశం విరిగి మీదపడ్డా తెలియనంతటి దీక్షతో క్లాసుపుస్తకాలు, జనరల్ పుస్తకాలు చదివే ప్రతిభ యిప్పుడు పుస్తకం చేతిలో వుంచుకుని ఆలోచనల్లో మునిగిపోతూంది. నిమిషాలు

గడిచిపోతున్నా పేజీ కదలడంలేదు. ఆడ, మగ ఫ్రెండ్స్ ఒకరి తర్వా తొకరు రావడం హస్కు కొడుతూ కూర్చోవడం, వాళ్ళు వెళ్ళిపోయాక అంతదాక మాట్లాడుకున్న విషయాల్ని గురించే ఆలోచించడం మధ్య మధ్యలో ఫోన్ కాల్స్, గంటల తరబడి ఫోనులో హస్కు. ఫోన్ పీకి అవతల పడేయాలన్నంత చికాకూ పుడుతూంది.

నిజమే. ఆ వయసులో అలాంటి సరదాలు, ఆకర్షణలు వుండడం సహజమే. ఉత్తుంగ జలపాతంలా, అనంతమైన చైతన్యంలా, నవ్వుతూ, తుళ్ళుతూ గంటల్ని నిమిషాల్లా దొర్లించాలని ఉత్సాహపడడం సహజమే. ఇంతవరకు తల్లిదండ్రుల చల్లటి నీడలో పెరిగిన పిల్లలు స్వేచ్ఛని అభిలషించడం, స్వంత అభిప్రాయాలేర్పరచుకోవడం, స్వతంత్రంగా ప్రవర్తించాలనుకోవడం తప్పు కాదు. అమ్మాయిలకు తనతోటి అమ్మా యిల్తో స్నేహం కంటే అబ్బాయిల్తో స్నేహం ఆకర్షణీయంగా కనబడడం, అలాగే అబ్బాయిలు అమ్మాయిల స్నేహం కోసం తహతహలాడడం సహజమే.

అబ్బాయిలు, అమ్మాయిలు స్నేహంగా వుండకూడదనే ఛాందసు రాలు కాదు తను. స్నేహానికి లింగభేదం అడ్డు రాకూడదనే తన అభి ప్రాయం. కాని యిప్పుడే కళ్ల విప్పుతున్న ఈ పిల్లలు, ప్రపంచమంటే ఓ పంచరంగుల స్వప్నంలా భావించే ఈ అమాయకులు, ఈనాడు పరి చయమయితే రేపు ఫ్రెండ్ అనుకుని, ఎల్లుండి నుంచి గంటలు తరబడి మాట్లాడుతూ కూర్చునే ఆవేశపరులు, తమ జీవితంలోని విలువైన కాలాన్ని కేవలం కాలక్షేపం బాతాఖానీతో వృధా పరుస్తూంటే తను సహించలేకపోతూంది. తెలివి తేటలు పుష్కలంగా వుండి కూడా, ప్రయ త్నించి తమ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోకుండా,మంచి మార్కులు తెచ్చు కోవడానికి శ్రమించకుండా, తల్లిదండ్రులు తమ పరిచయాల్ని, హోదాను

డబ్బును ఉపయోగించి తమకు మార్కులు వేయించాలని ఆశపడేంత తప్పు దారిలో పయనిస్తున్నా రంటే యిందుకుబాధ్యు లెవరు? అని తర్కించు కుంటూంది తను.

తమ తల్లిదండ్రుల డబ్బు, హోదా, గొప్పతనం భవిష్యత్తులో తమ జీవితాలకు ఆధారం కాజాలవని, తాము స్వయంగా ఆర్జించుకున్న జ్ఞానం, చదువు, సమర్థత మాత్రమే శాశ్వతమని యీ కసుగాయలు గుర్తిస్తే యింత బాధ్యతారహితంగా వుండరేమో.... కూతురి పిలుపు విని ఆలో చనల్లో నుంచి బయటపడింది మైథిలి.

మైథిలికి లెటరందించి, కాసేపటికే ప్రతిభ నావరించిన ఆవేశపు తెర జారిపోయింది. తన లెటరు చదివాకకూడా తనను అదేమని ప్రశ్నించ కుండా, తన తెలివితక్కువతనానికి చివాట్లు వెయ్యకుండా నిర్వికారంగా అతి మామూలుగా ప్రవర్తిస్తున్న తల్లిని చూసి ఆశ్చర్యపోతోంది ప్రతిభ. తను ఆవేశంలో తొందరపడి మమ్మీని నొప్పించింది. కాని తను నొచ్చు కోవడం, కన్నీళ్ళు పెట్టడం మమ్మీ భరించలేదు. అందుకే తన వాచాల త్వాన్ని క్షమించేసి మౌనంగా వూరుకుంది. "ఏమిటి నాన్నా!" తన పిలుపు విని ప్రశ్నిస్తున్న తల్లి కళ్ళల్లో ప్రతిఫలిస్తున్న ప్రేమను చూసి మరీ కుంగిపోయింది ప్రతిభ. ప్రతిభ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూంది. ఆమె మాటలు కూడదీసుకుని నోరు విప్పే లోగా కారు శిరీష యింటి ముందాగింది. శిరీష కాలుగాలిన పిల్లిలా యింట్లోకి, బయటికి తిరుగు తుందల్లా కారు శబ్దం విని ఒక్క వరుగున బయటికొచ్చింది.

"ఆంటీ! మా యింట్లో వాళ్ళంతా సినిమాకివెళ్ళారు. ఏం చెయ్యాలో తోచక ప్రతిభకు ఫోన్ చేశాను. ఉజ్వలకి చాలా బ్లీడింగ్ అయిపోతూంది ఆంటీ!" స్పృహ వుండీ, లేనట్లుగా వున్న ఉజ్వలని చేతులమీద తీసు

కొచ్చి కార్లో పడుకోబెట్టారు. తమ ఫామిలీ డాక్టర్ నర్శింగ్‌హోమ్ వైపు కారుని పోనిచ్చింది మైథిలి.

రక్తం ఎక్కించి, ఉజ్వల గర్భంలో మిగిలిపోయిన పిండాన్ని తీసేశాక గాని రక్తస్రావం ఆగి, ప్రమాదస్థితిని దాటలేదు.

"ఆంటీ!" కన్నీళ్ళతో మైథిలి చేతులందుకుని కళ్ళకద్దుకుంది ఉజ్వల.

"ఛ! ఏమిటమ్మా అది?" ఉజ్వల కన్నీళ్ళను తుడిచింది మైథిలి.

"ఆంటీ!మీ ఋణాన్నెలా తీర్చుకోను! నే నెంతపొరపాటుపని చేశానో తెలిసికూడా కడుపులో పెట్టుకున్నారు మీరు. అదే మా అమ్మయితే యీ పాటి కెంత రాద్ధాంతం చేసేదో! నా పొరపాటుని భూతద్దంలో పెట్టి చూపించి నాలోని బ్రతకాలనే కోరికను త్రుంచేసేది." ప్రతిభ చూపులు దయగా, ప్రేమగా ఉజ్వలని చూస్తున్న తల్లి మీదకు మరలాయి. ఆమె మీదినుంచి పశ్చాత్తాపంతో పునీతమౌతూ సజల నేత్రాలతో కృతజ్ఞతగా, భక్తిగా తల్లి వంక చూస్తున్న ఉజ్వల మీదికి చేరాయి.

ఉజ్వలని చూస్తూంటే కడుపంతా దేవేసినట్లుగా వుంది మైథిలికి. పిల్లలకు తగు స్వేచ్ఛనిస్తే మంచి, చెడు స్వానుభవంతో తెలుసుకుని మంచి వైపు మరలుతారనే ఆశతో స్వేచ్ఛని ప్రోత్సహిస్తున్నారు తన లాంటి వాళ్ళు. కాని మంచికంటే చెడే ఆకర్షణీయంగా ఉంటుందని, ఆడ పిల్లల్ని గట్టి కట్టుదిట్టాల్లో పెంచాలని ఘోషపెట్టే ఛాందసుల మాటల్ని నిజం చేస్తున్నారు ఉజ్వలలాంటి అమ్మాయిలు. అలాంటి అమ్మాయిల్ని చూశాక స్వేచ్ఛమీద తమ అభిప్రాయాలు, నమ్మకాలు పొరపాటేమో అని తర్కించుకునే దౌర్భాగ్యస్థితిలోకి వెళ్ళిపోతున్నారు తనలాంటి వాళ్ళు....ఉజ్వల చేతిని ఆప్యాయంగా పట్టుకుని ఆలోచనల్లో మునిగి పోయింది మైథిలి.

రెండు రోజులు ఆఫీసు పనితో హడావిడిగా వుండడంవల్ల మైథిలితో ఒంటరిగా మాట్లాడే అవకాశం చిక్కలేదు ప్రతిభకు.

"మమ్మీ!" సంకోచంగా, కళ్ళు దించుకుని పిలిచింది ప్రతిభ.

"ఏమిటి నాన్నా! రా. యిలా కూర్చో" మృదువుగా పిలిచి సోఫాలో తన ప్రక్కన కూర్చోబెట్టుకుంది మైథిలి.

"మమ్మీ! నన్ను క్షమించు. ప్లీజ్ ఫర్ గివ్ మి". అప్పటిదాకా ఆపుకున్న ఏడుపు ఒక్కసారి వెలికివచ్చి తల్లి గుండెల్లో తల దూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది ప్రతిభ.

"ఏమిటి నాన్నా! ఎందుకు, ఏంచేశావని నిన్ను క్షమించడం?" ఆదుర్దాగా ప్రశ్నించింది మైథిలి. ప్రతిభ కన్నీళ్ళామె గుండెను కోస్తు న్నాయి.

"నేనెంత తెలివి తక్కువగా ఆ లెటరు వ్రాశానో, ఎంతగా నిన్ను బాధపెట్టానో తెలుసుకున్నాను మమ్మీ! నా తొందరపాటునీ, ఆవేశాన్నీ క్షమించు మమ్మీ!" ఏడుస్తూనే అంది ప్రతిభ.

"నీ తలకాయ-క్షమించడమేమిటి? అందుకే తెలుగు సినిమా లదే పనిగా చూడొద్దనేది నిన్ను." నవ్వుతూ తేల్చేయాలని చూసింది మైథిలి.

"కాదు మమ్మీ! ఎంత ఫూలిష్‌గా నిన్ను ప్రశ్నించానో నాకు తెలుసు" ఒక నిమిషం ప్రేమగా కూతురి తల నిమురుతూ వుండిపోయింది మైథిలి.

"పండూ! నీ ఉత్తరం గురించి నేను మరిచిపోదామనే నిశ్చయించు కున్నాను. ఏదో ఆవేశంలో వ్రాసుంటావనే సమాధానపడ్డాను. ఆ విషయం యెత్తి నిన్ను బాధ పెట్టకూడదనే అనుకున్నాను. ఆ ప్రసక్తి నువ్వే

ఎత్తావు గనక నా మనసులోది కొంచెం చెప్తాను. నాకు వీలయినప్పుడల్లా అవసరమనిపించినప్పుడల్లా నిన్ను కూర్చోబెట్టుకుని మంచేదో, చెడేదో నీకు చెప్పడానికి ప్రయత్నిస్తూనే వున్నాను."

"నీ కర్తవ్యాన్ని నువ్వు బాగానే నిర్వర్తిస్తున్నావు మమ్మీ! నేనే నా బాధ్యతను మరిచి పోతూంటాను. ఆవేశంగా ఆలోచిస్తూ వుంటాను." కూతురి మాటలు విని చిన్నగా నవ్వింది మైథిలి.

"అది నీ తప్పుకాదు. నీ వయసుది. అదలా వుంచు. ఒక్కసారి స్వేచ్ఛని అమితంగా కోరే అమ్మ, మగపిల్లడు,ఆడపిల్ల-డామ్ నాన్సెన్స్-ఇద్దరూ సమాన స్వేచ్ఛ ననుభవించాలని మనసారా నమ్మే అమ్మ ఎందుకు నీ స్నేహాలకు హద్దులు పెడుతూందో ఆలోచించు.నీకు స్వేచ్ఛ లేకుండా చెయ్యడం నా అభిమతం కాదు, సంపూర్ణ స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తూ నువ్వు సహజంగా వికసించాలనే నా కోరిక. కాని....ఇంకా ఇప్పుడే కళ్ళు విప్పుతున్న నీకు ప్రపంచమంతా ఓ రంగుల హరివిల్లులా కనిపించి, అందులోని నల్లటి నీడల్ని గుర్తించలేక భంగపాటు చెందుతా వేమో, ఆ భంగపాటువిలుప నీ జీవితమే అవుతుందేమో అని నా భయం. తల్లిగా నేనలా భయపడ్డం అసహజం కాదనుకుంటాను." ఆగి కూతురి వంక చూసింది మైథిలి. కన్నీళ్ళు తుడుచుకుని తల్లి చెప్పేది శ్రద్ధగా విం టూంది ప్రతిభ. "నాన్నా! స్వేచ్ఛకి, విశృంఖలత్వానికి, అమ్మాయిల్తో స్నేహానికి, అబ్బాయిల్తో స్నేహానికి, మంచి అబ్బాయికి, చెడ్డ అబ్బాయి లకి మధ్య వుండే తేడాను గుర్తించడానికి నువ్వింకా చాలా చిన్నదానివి. యింకా కొన్నాళ్ళు నా అనుభవం, సూచనల వెలుగులో మనుషుల్ని అంచనా వెయ్యడానికి ప్రయత్నించు. ఎలాంటి భ్రమలూ లేకుండా పరిస్థితుల్ని గుర్తించే నిబ్బరాన్ని అలవరచుకో. మంచికి, చెడుకి కొల బద్దలు లేక పోయినా, కాలాన్నిబట్టి, మనుషుల్ని బట్టి, వారి సంస్కృతిని

బట్టి అవి మారినా, కొన్ని ప్రాథమిక సూత్రాలు వాటిని నిర్ణయిస్తున్నాయి. అవేమిటో తెలుసుకుని జీవితాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ అడుగు వెయ్యి. అప్పుడు నీ స్వేచ్ఛకు నేనుగాని, మీ డాడీగాని హద్దులు పెట్టఖ్ఖర్లేదు. నీకు నువ్వే కొన్ని సరిహద్దుల్ని గీసుకుని వాటికి లోబడి ప్రవర్తిస్తావు." ప్రతిభ అప్పటిదాకా జాగ్రత్తగా వింటున్నదల్లా నోరు విప్పింది.

"స్వేచ్ఛకి, విశృంఖలత్వానికి తేడాయేమిటో ఆడదానికి వరంగా వున్న మాతృత్వమే ఆడపిల్ల స్వేచ్ఛకి, మగవాడి స్వేచ్ఛకి ఎలా తేడాను సృష్టిస్తూందో ఉజ్వల అనుభవించిన నరకం చూశాక బాగానే అర్థమయింది. మమ్మీ! ఆలోచిస్తే చాలా చిత్రంగా కనిపిస్తూంది. ఇన్నిన్ని కథలు చదువుతూ, సినిమాలుచూస్తూ, జీవితాన్ని గమనిస్తూ కూడా ఎవరికి వాళ్ళం మా దగ్గరకు వచ్చేసరి కదే ఆకర్షణలో పడిపోతున్నాం. ఇందులో అబ్బాయిల్ని నిందించాల్సిన పనిలేదు. వాళ్ళని వాళ్ళ లిమిట్స్‌లో వుంచ గల శక్తి మాకుంటే మా స్నేహం సవ్యంగానే వుంటుంది. ఆ శక్తిలేక మా తెలివి తక్కువవల్లే యిలాంటి పరిస్థితుల్ని కొని తెచ్చుకుంటున్నాం. మా ఉద్రేకమే మాకు అనర్థాల్ని తెచ్చిపెడుతూంది. యిది మేము గుర్తించేసరికి సమయం మించిపోతూంది. జరిగిందానికి ఉజ్వల ఎంత కుమిలిపోతోందో! దాన్ని చూస్తూంటే నా గుండె నీరయిపోతూంది మమ్మీ" ప్రతిభ గొంతు గద్గదమయింది. కళ్ళు తడిగా అయాయి.

"నాన్నా! నువ్వు, ఆ అమ్మాయి ఇప్పుడు పడుతున్న బాధనే చూస్తున్నావు. ఆ లేత మనసు మీద పడిన ఈ భయంకరమైన ముద్ర జీవితాంతం ఎలా వెంటాడి వేధిస్తుందో నీకు తెలియదు. క్షణికమైన ఆవేశంలో చేసిన ఈ ఒక్క పొరపాటు ఆమె మొత్తం జీవితాన్ని ప్రభావితం చేస్తుంది" బాధగా చెప్పసాగింది మైథిలి. "ఉజ్వల భవిష్యత్తుని తలుచుకొనే ఏడుస్తూంది మమ్మీ! మాలాంటి వాళ్ళకు విలువల్ని వదిలేసి

విశృంఖలంగా బ్రతకడమూ ఇష్టం వుండదు. ధైర్యంగా, నిగ్రహంగా, పవిత్రంగా బ్రతకడానికి నిజాయితీగా ప్రయత్నించనూ లేము" కించపడుతూ చెప్పింది ప్రతిభ. ఒక నిముషం ఆలోచిస్తూ వుండిపోయింది మైథిలి.

"మాతృత్వం ఆడపిల్ల స్వేచ్ఛకు హద్దులేర్పరుస్తుందన్నావు. నిజమే. కాని...మాతృత్వపు భయంతో కాక, పవిత్రత మీది నమ్మకంతో నీ స్వేచ్ఛకు హద్దులేర్పరచుకోవాలి. నాన్నా! యింతగా నీతో ఎందుకు చెప్తున్నానో తెలుసా? నీలాంటి ఎంతోమంది ఆడపిల్లల్లా నువ్వు కూడా ఒక పెనుతుఫానులో చిక్కుకుని దిక్కుతోచక అల్లల్లాడిపోతావేమోననే భయంతో, నా రెక్కల్ని నలువైపులా చాచి ఆ భయంకరమైన తుఫానుల్నుంచి నిన్ను రక్షించుకోవాలనే తాపత్రయంతో యిన్నివిధాల చెప్తున్నాను. ఈ తాపత్రయాన్నే నువ్వు నా అజ్ఞానంగా భావించినా, లేక నీ స్వేచ్ఛకు సంకెళ్ళు వేస్తున్నట్లుగా భావిస్తుంటే....ఏమిటి నాన్నా ఆలోచిస్తున్నావు?" ఆర్తిగా కూతురి వంక చూసింది మైథిలి.

"ఏం లేదు మమ్మీ! నేనెంత అదృష్టవంతురాలో్న అనుకుంటున్నాను. మంచినీ, చెడునీ ఓపిగ్గా, నేర్పుగా వివరించి చెప్పగల అమ్మ ప్రతి ఆడపిల్లకూ వుంటే "టీనేజ్" దశని యే ప్రమాదం లేకుండా దాటేస్తుందికదా అనుకుంటున్నాను." తల్లి గుండెలకి అంటుకుపోయి ఆమె నడుము చుట్టూ చేతులు వేస్తూ అంది ప్రతిభ.

"చాల్లే నీ పొగడ్తలు! మీ డాడీ యిదొక్కటి నేర్పారు నీకు," అందంగా విసుక్కుంది మైథిలి.

"మమ్మీ! మై స్వీట్ మమ్మీ!" తల్లి చెక్కిలిమీద ఓ తియ్యటి ముద్దును ముద్రించింది ప్రతిభ.